సాక్షి అనకాపల్లి

సోమవారం । 10 । జూన్ । 2024



అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. 2లో



ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు

విశాఖ కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. 2లో

గరిష్ఠం/కనిష్ఠం
34.5/27.2

వాతావరణం

తేలికపాటి నుంచి మోస్తరు వర్షం ఒకటి రెండు చోట్ల పడే అవకాశముందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరీ చెప్పారు.

న్యూస్‌రీల్

నూకాంబిక దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు స్థానిక గవర పాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. విశాఖ ఉమ్మడి జిల్లాలో పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్య లో తరలి వచ్చారు. శనివారం రాత్రి కొంతమంది భక్తులు వారి ఇళ్ల వద్ద అమ్మవారి పాట నిర్వహించి ఆదివారం ఉదయం కాలినడకన ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. పలువురు ఆలయం వద్ద వంటలు చేసుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు ఉచితంగా మజ్జిగ, ప్రసాదం పంపిణీ చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈవో బండారు ప్రసాద్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

గవర కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రాజీనామా



కొణతాల ఉమాదేవి

ఎస్.రాయవరం: రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టరు పదవికి కొణతాల ఉమాదేవి ఆదివారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాణం ఉన్నంత వరకు తాము వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వెంటే నడుస్తామని చెప్పారు.

డీఈఐ కోర్సులకు దరఖాస్తులు

ఆరిలోవ(విశాఖ): విశాలాక్షినగర్ ప్రాంతం దయాల్‌నగర్‌లో దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్(డీఈఐ)లోనిర్వహిస్తున్న పలు కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఇనిస్టిట్యూట్ ఇన్‌చార్జి దక్షిణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి, ఇంటర్మీడియట్ విద్యార్హతతో పలు కోర్సులు న్విహిస్తున్నట్లు పేర్కొన్నా రు.డ్రెస్‌డిజైనింగ్-టైలరింగ్, కటింగ్-సూయింగ్, టెక్స్‌టైల్స్ డిజైనింగ్-ప్రింటింగ్, మోటార్ వెహికల్ మెకానిజం, ఎలక్ట్రీషియన్ కోర్సులకు దరఖాస్తులు చేసుకోదలిచినవారు పదో తరగ తి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆఫీస్ అసిస్టెంట్-కంప్యూటర్ ఆపరేటర్, మోడల్స్ ఆఫీస్ మేనేజ్‌మెంట్-సెక్రటేరియట్ ప్రాక్టీస్ కోర్సులకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలన్నారు.ఆసక్తి గల వారు www.dei.ac.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకొని ఈనెల 26లోగా అందజేయాలన్నారు.

- కొనసాగుతున్న ఉష్ణతాపం, ఉక్కపోత
- గాలిలో తేమ శాతం పెరుగుదలే కారణం
- మరో మూడు రోజులు అసౌకర్య వాతావరణం

మృగశిర వచ్చినా ముచ్చెమటలే!



అనకాపల్లిలో ఎండ ధాటికి వెలవెలబోతున్న రోడ్డు

సాక్షి, విశాఖపట్నం: రోహిణీ కార్తె పది రోజులకు పైగా ప్రభావం చూపించింది. ఉష్ణతాపం, ఉక్కపోత కలగలిసి జనాన్ని ఉక్కిరి బిక్కిరి చేసింది. ఏటా వేసవిలో రోహిణి కార్తె ప్రభావం అలాగే ఉంటుందని అంతా భరించారు. అయితే రోహిణి కార్తె వెళ్లిపోయాక మృగశిర కార్తె రాకతో వాతావరణం చల్లబడుతుందని భావించారు. కానీ రోహిణి వెళ్లిపోయి శనివారం నుంచి మృగశిర కార్తె ప్రవేశించింది. కానీ పరిస్థితిలో ఏమంత మార్పు కనిపించలేదు. ఉష్ణ తీవ్రతతో పాటు ఉక్కపోత కూడా కొనసాగుతూనే ఉంది. తగ్గేదే లే.. అన్నట్టు ముచ్చెమటలు పోస్తూనే ఉన్నాయి. భానుడు కూడా సుర్రుమంటూనే ఉన్నాడు. దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మృగశిర కార్తె **వచ్చినా చల్లదనం కానరావడం లేదంటూ నిట్టూరుస్తున్నారు. ప్రస్తుతం గాలిలో తేమ శాతం అధికంగా ఉండడమే ప్రస్తుత పరిస్థితికి కారణమని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. కొద్ది రోజులుగా విశాఖలో గాలిలో తేమ 70–80 శాతానికి పైగా** నమోదవుతోంది. గాలిలో తేమ 60 శాతానికి మించితే ఉక్కపోత ఊపందుకుంటుంది. కానీ ఇప్పుడు అంతకంటే ఎక్కువగా నమోదవుతుండడం వల్ల ఉక్కపోత కొనసాగుతోంది. మరోవైపు నగరంలో పగటి ఉష్ణోగ్రతలు సాధారణంకంటే రెండు మూడు డిగ్రీలు అధికంగా 34–36 డిగ్రీల మధ్య రికార్డవుతున్నాయి. ఇలా ఒకపక్క ఉక్కపోత, మరోపక్క ఉష్ణ తాపం వెరసి నగర వాసుల్ని అవస్థల పాల్జేస్తున్నాయి. మరో రెండు మూడు రోజులు ఇదే వాతావరణం కొనసాగుతుందని, ఆపై కాస్త ఉపశమనం కలిగిస్తుందని వాతావరణ నిపుణులు భరోసా ఇస్తున్నారు.



తలపై చున్నీలు వేసుకుని వెళుతున్న యువతులు

తాండవలో తగ్గిన నీటి మట్టం

- జలాశయం డెడ్ స్టోరేజీ 345 అడుగులు
- **ప్రస్తుత** నీటి మట్టం 355 అడుగులు **మాత్రమే**
- **ఇదే పరిస్థితి** కొనసాగితే ఆయకట్టు **రైతులకు** ఇబ్బందే



వర్షాలు లేక గణనీయంగా తగ్గిన తాండవ రిజర్వాయరు నీటిమట్టం

నాతవరం: ఆశించిన స్థాయిలో వర్షాల్లేకపోవడంతో **తాండవ జలాశ**యంలో నీటి మట్టం గణనీయంగా **తగ్గిపోయింది.** ఇదే పరిస్థితి ఈ నెలంతా కొన**సాగితే ఖరీఫ్** సీజన్‌లో తాండవ పరిధి ఆయకట్టు **రైతులకు గడ్డు** పరిస్థితి తప్పదు. తాండవ ప్రాజె**క్టులో** ఆదివారం నాటికి నీటి మట్టం 355 **అడుగులు మా**త్రమే ఉంది. ప్రాజెక్టు ప్రమాద **స్థాయి నీటి మ**ట్టం 380 అడుగులు. డెడ్ స్టోరేజీ **345 అడుగులు.**

వర్షాల్లేక.. నీరు చేరక

గతేడాది ఖరీఫ్ సీజన్‌లో వరి పంటకు శివారు ఆయ**కట్టుకు సైతం** పుష్కలంగా నీరు సరఫరా చేశారు. **అప్పటి నుంచి** తాండవ ప్రాజెక్టులో నీరు చేరేంతగా వర్షాలు కురవలేదు. తాండవ రిజర్వాయర్ నీటి ఆధారంగా అనకాపల్లి జిల్లాలోని నాతవరం, కోటవురట్ల, నర్సీపట్నం, పాయకరావుపేట మండలాలకు, కాకినాడ జిల్లాలోని కోటనందూరు, రవతలపూడి మండలాల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో ఏటా 52,464 ఎకరాల ఆయకట్టుకు నీరందుతోంది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో ఇటీవల ఆడపా దడపా కురిసిన వర్షాలకు రైతులు నారు ముడులు దుక్కుచేసి వరి సాగుకు విత్తనాల కోసం ఎదురుచూస్తున్నారు. గత నెలలో భూమిని సారవంతం చేసే పచ్చిరొట్ట విత్తనాలను ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేసి, రైతులు పొలాల్లో వేసుకున్నారు. వర్షాల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

వానలు కురిస్తేనే సాగునీరు

ఈ నెలలో భారీ వర్షాలు కురిసి తాండవ ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో ఉన్న కొండలు, గెడ్డలు ఉప్పొంగి ప్రవహించి ప్రాజెక్టులో నీరు చేరితేనే ఖరీఫ్ సాగుకు నీటిని విడుదల చేసే అవకాశం ఉంటుంది. ఇప్పుడున్న నీటి మట్టం మేరకు తాండవ ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు నీటిని విడుదల చేసే అవకాశం లేదు. జిల్లాలో మేజర్ ప్రాజెక్టుగా తాండవ రిజర్వాయర్ ఉండటంతో అధికంగా ఖరీఫ్ సీజన్‌లో వరి నాట్లు ఇక్కడే రైతులు వేసేవారు. తాండవ ప్రాజెక్టులో నీటి మట్టం గణనీయంగా తగ్గిపోవడంతో నిర్మాణ సమయంలో తాండవ ప్రధాన గట్టు లోపలి భాగంలో ఏర్పాటు చేసిన రాతిపేర్పు బయటకు కనిపిస్తోంది. ఇటీవల కాలంలో తాండవ ప్రాజెక్టులో నీటి మట్టం ఈ విధంగా తగ్గిన దాఖలాలు లేవు. దీంతో గట్టు రాతిపేర్పు తాండవ అడుగు భాగం చూసేందుకు చూపరులు ఆసక్తి చూపిస్తున్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అదరగొట్టారు



శర్వన్‌నాయుడుకు స్వీటు తినిపిస్తున్న తోటాడ సర్పంచ్ కోటేశ్వరరావు-మంగవేణి దంపతులు



సుర్ల నికిల్ నందన్



బిక్కి సిద్ధార

నాతవరం/మునగపాక/తుమ్మపాల: ఐఐటీలో బీటెక్ సీట్ల భర్తీకి గత నెల 26న దేశవ్యాప్తంగా నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జిల్లాలో విద్యార్థులు ప్రతిభ చూపారు. నాతవరం మండలం గునిపూడి గ్రామానికి చెందిన సుర్ల నికిల్ నందన్‌కు ఆల్ ఇండియా స్థాయిలో 329 ర్యాంక్ లభించింది.

తోటాడ విద్యార్థికి 1742 ర్యాంక్ : మునగపాక మండలంలోని తోటాడకు చెందిన శర్వన్‌నాయుడు ఆల్ ఇండియా స్థాయిలో 1742వ ర్యాంక్, ఓబీసీలో 282వ ర్యాంక్ సాధించాడు. శర్వన్ నాయుడు తండ్రి కిరణ్ పోలీస్‌శాఖలో పనిచేస్తున్నారు. శర్వన్‌నాయుడుకు తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి, కోటేశ్వరరావులు స్వీటు తినిపించి అభినందించారు.

సిద్ధార్థకు 7726 ర్యాంక్ : అనకాపల్లి పట్టణానికి చెందిన బిక్కి సిద్ధార్థ ఈబ్ల్యూఎస్‌లో -944, ఓపెన్ కెటగిరీలో -7726 ర్యాంక్ సాధించినట్టు నారాయణ కళాశాల డీజీఎం.హనుమంతురావు, ఏజీఎం బి.నాగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు.అనకాపల్లిలోని శారదానగర్‌లో నివాసముంటున్న సిద్ధార్థ విశాఖపట్నంలోని నారాయణ కళాశాలలో చదువుకున్నట్టు తెలిపారు.

స్టూడెంట్ పాసుల జారీకి ఆర్టీసీ సిద్ధం

- ఈ నెల 12 నుంచి మంజూరు
- 2024–25 సంవత్సరానికి ఏర్పాట్లు



అనకాపల్లి డిపోవద్ద బస్‌పాస్ కౌంటర్



ఆర్టీసీ బడిబస్సు

అనకాపల్లి: త్వరలో పాఠశాలలు, కళాశాలలు తెరుచుకోనున్న నేపథ్యంలో జిల్లాలో విద్యార్థులకు బస్‌పాసులు జారీ చేసేందుకు ఆర్టీసీ అధికారులు సిద్ధమవుతున్నారు. అనకాపల్లి, నర్సీపట్నం డిపోల పరిధిలో విద్యార్థులకు 2024–25 సంవత్సరానికి ఎలాంటి ఇబ్బందులూ లేకుండా స్టూడెంట్ బస్సు పాస్‌లను జారీ చేయడానికి ఏర్పాట్లు చేశారు. వేసవి సెలవుల్లో ఆటలు, విహార యాత్రల్లో నిమగ్నమై విద్యార్థులు రెండు రోజుల్లో బడిబాట పట్టనున్నారు. సొంతగ్రామాల నుంచి ఇతర గ్రామాలు, పట్టణాల్లో విద్యా సంస్థలకు వెళ్లే విద్యార్థులకు ఆర్టీసీ ఏటా రాయితీ, ఫ్రీ బస్ పాస్‌లు జారీ చేస్తోంది. ఈ పాసులను ఈ నెల 12వ తేదీ నుంచి జారీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అక్షరాస్యత శాతం పెంచే లక్ష్యంతో చాలా ఏళ్లుగా 12 సంవత్సరాల లోపు బాలురు, 18 సంవత్సరాల్లోపు బాలికలకు ఆర్టీసీ ఉచిత బస్‌పాస్‌లు జారీ చేస్తోంది. ఈ వయసు దాటిన విద్యార్థులకు బస్సురూట్ ఆధారంగా రాయితీపై పాస్‌లు ఇస్తున్నారు. ప్రతి ఐదు కిలోమీటర్లను ఒక స్టేజీగా పరిగణలోకి తీసుకుని దూరాన్ని బట్టి రాయితీపై పాస్‌లు అందజేస్తున్నారు. అనకాపల్లి, నర్సీపట్నం డిపోల పరిధిలో ఇప్పటికే ప్రత్యేక బస్‌పాస్ కౌంటర్లను ఏర్పాటుచేశారు. ఆర్టీసీ ఇచ్చే ఈ బస్‌పాస్ ఏడాది వరకూ పనిచేస్తుంది. పాస్ దరతో పాటు సంవత్సరం గుర్తింపు కార్డు కోసం రూ.100, నెలవారీ గుర్తింపు కార్డుకు రూ.50, సర్వీసు చార్జ్ రూ.40 అదనంగా విద్యార్థి చెల్లించాల్సి ఉంటుంది. రాయితీ పాస్‌లను నెల, మూడు నెలలు, ఏడాది కాలపరిమితో మంజూరు చేస్తున్నారు. గడువు ముగిశాక రెన్యూవల్ కోసం పాఠశాలల హెచ్ఎంలు, కళాశాలలు ప్రిన్సిపాల్ సంతకంతో తిరిగి పొందాల్సి ఉంటుంది. సాధారణ విద్యార్థులకు జూన్ నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ వరకూ, ఐటీఐ, పారామెడికల్ కోర్సులు చదివే విద్యార్థులకు మే నెలలో కూడా రాయితీ పాస్‌లు అందజేస్తారు.

ఆన్‌లైన్‌లో...

ప్రభుత్వ, ప్రైవేట్ హైస్కూళ్లు, కళాశాలలు, ఐటీఐ, డిప్లొమా, ఇంజినీరింగ్, డిగ్రీ చదివే విద్యార్థులు ముందుగా ఆన్‌లైన్‌లో బస్‌పాస్‌కోసం దరఖాస్తు చేసుకుని, తమ విద్యాసంస్థ నుంచి ఫార్వర్డ్ చేయించుకోవాలి. దరఖాస్తు ఫారంపై ప్రిన్సిపాల్/హెచ్ఎం సంతకం, సీల్ వేయించుకుని, వారు ఎంచుకున్న కేంద్రంలో పాస్ పొందవచ్చు.

గత ఏడాది ఇలా...

అనకాపల్లి డిపోలో 2023-24 ఏడాదిలో 12 సంవత్సరాలలోపు బాలురకు, 18 సంవత్సరాల లోపు బాలికలకు కలిపి 2,050 ఉచిత బస్‌పాస్‌లు, 12,500 రాయితీ బస్‌పాస్‌లు జారీ చేశారు. నర్సీపట్నం డిపో పరిధిలో 3,700 ఉచిత బస్‌పాస్‌లు, 6,050 రాయితీ బస్‌పాస్‌లు జారీచేశారు.

14 ప్రత్యేక బడి బస్సులు

అనకాపల్లి డిపోనుంచి జిల్లాలో కోనాం, లక్ష్మీపురం, బంగారమ్మపాలెం, తేగాడ, వాడ్రాపల్లి, రాజాం గ్రామాల్లోని మోడల్ స్కూళ్లకు, నర్సీపట్నం డిపో నుంచి వేములపూడి, చెర్లోపాలెం, బూరుగుపాలెం, సబ్బవరం, రాజుపేట, సరుగుడు, తాండవ, టి.అర్జాపురం గ్రామాల్లోని ఏపీ మోడల్ స్కూళ్లకు కలిపి మొత్తం 14 ప్రత్యేక బడి బస్సులను ఏర్పాటు చేశారు.

ప్రత్యేక కౌంటర్




గత ఏడాది కంటే ఈ ఏడాది జారీచేసే పాస్‌లు సంఖ్య పెరిగే అవకాశం ఉంది. నూతన విద్యా సంవత్సరంలో విద్యార్థులు బస్‌పాస్ కోసం వేచి ఉండే సమయాన్ని తగ్గించేందుకు కొత్త సాఫ్ట్‌వేర్‌ను ఏర్పాటుచేశాం. హైస్కూల్ హెచ్ఎంలు, కళాశాల ప్రిన్సిపాళ్లు కొత్తగా జాయిన్ అయిన విద్యార్థుల కంటే పాత విద్యార్థుల వివరాలను ముందుగా ఆర్టీసీ ఆన్‌లైన్‌లో నమోదు చేయడంపై దృష్టిసారించాలి. జిల్లాలో రెండు డిపోల్లో బస్‌పాస్‌లు ఈనెల 12 నుంచి పంపిణీ చేసేందుకు మా ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారు.

– కె.పద్మావతి, జిల్లా ప్రజారవాణాశాఖ అధికారి, అనకాపల్లి

హలో.. ఇగ్వానా!

జూలో అలరిస్తున్న ఇగ్వానాలు



జూలో ఇగ్వానా హౌస్‌లో గ్రీన్ ఇగ్వానా

ఆరిలోవ(విశాఖ): ఇందిరాగాంధీ జూ పార్కులో గ్రీన్ ఇగ్వానాలు సందర్శకులను విపరీతంగా అలరిస్తున్నాయి. పెద్ద బల్లి జాతికి చెందిన ఇగ్వానాలు వయసు పెరుగుతున్న కొద్దీ వాటి రంగులు మారిపోతుంటాయి. పిల్లలుగా ఉన్నప్పుడు కొంత వరకు ఆకు పచ్చని రంగులో కనిపిస్తాయి. అవి వయసుతో పాటు బూడిత రంగులోకి మారిపోతాయి. వివిధ రకాల పండ్లతో పాటు మెత్తని మట్టి తింటాయి. ప్రస్తుతం జూలో పిల్లలతో పాటు పెద్దవి 50 వరకు ఇగ్వానాలు ఉన్నాయి. కొన్ని పచ్చగా(పిల్లలు), ఇంకొన్ని బూడిద రంగులో(పెద్దవి) కనిపిస్తూ ఆకట్టుకుంటున్నాయి. పెద్దవి తల నుంచి తోక వరకు సుమారు 5 అడుగులు దాటి పొడవుంటాయి. వీటి బరువు 5 నుంచి 8 కిలోలు. జూలో పాముల జోన్‌లో అధికారులు రెండు ఇగ్వానా హౌస్‌లు నిర్మించారు. వీటిల్లో సహజ వాతావరణం కల్పించి ఇసుక, మట్టి, దుంగలు ఏర్పాటు చేశారు. సందర్శకులు చూడడానికి ఇగ్వానా హౌస్ లోపల అద్దాలు అమర్చారు. ఇవి కర్ర దుంగలపై, ఇనుప ఊచలు పైకి పాకడం, నేలపై ఇసుక, మట్టిని వాటి పొడవైన వేళ్లతో గొయ్యి చేసుకుంటూ సందర్శకులను అలరిస్తున్నాయి. ఆ గొయ్యిల్లోనే అవి గుడ్లు పెట్టి పిల్లలను పొదుగుతుంటాయి. కాగా.. 2012లో జూ అధికారులు చెన్నై నుంచి రెండు జతల గ్రీన్ ఇగ్వానాలను రెండు విడతల్లో విశాఖ జూకు తీసుకొచ్చారు. వీటిలో ఓ జత దొంగతనానికి గురికావడంతో.. మిగిలిన ఒక జత ఇగ్వానాలు వాటి సంతతిని పెంచుకున్నాయి. ప్రస్తుతం వీటి సంఖ్య 50 దాటింది. సాధారణంగా బాహ్య ప్రపంచంలో ఏకాంతంగా గడపడం ఇగ్వానాలకు అలవాటు. అయితే సందర్శకుల కోసం వాటిని ఒకే చోట ఉంచుతున్నారు. అందుకు సహజ వాతావరణం కల్పించారు. ఇవి పొడి కాలంలో గుడ్లు పెట్టి 50 నుంచి 84 రోజుల్లో పిల్లలను పొదుగుతాయి. వీటి జీవిత కాలం 15 నుంచి 20 ఏళ్లు. అడవుల్లో పువ్వులు, రెమ్మలు, ఆకులు, పండ్లు ఆహారంగా తీసుకుంటాయి. ఇవి నీటి అడుగు భాగంలో సుమారు 30 నిమిషాల పాటు గడపగలవు. మాంసం కోసం వేటగాళ్లు వీటిని వేటాడుతుంటారు. వారి చేతికి చిక్కకుండా నీటి అడుగున దాక్కుంటాయి.



దర్శించుకుంటున్న కలెక్టర్ విజయసునీత, ఐటీడీఏ పీవో అభిషేక్, ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు



ఘటాలతో కలెక్టర్ విజయ సునీత, ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



ఘటాల ఊరేగింపులో ఆకట్టుకున్న శక్తి వేషాలు

- పోటెత్తిన భక్తజనం

మోదకొండమ్మా.. కరుణించమ్మా



మోదకొండమ్మ ఉత్సవాలకు భారీగా తరలివచ్చిన భక్తులు

- పాడేరులో ఘనంగా అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం
- తెలుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తజనం
- కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం
- డప్పు వాయిద్యాలు, థింసా నృత్యాలతో సందడి
- ఇంటి పండగలతో ఆధ్యాత్మిక వాతావరణం

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర భక్తుల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మతల్లి గిరిజన జాతర ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. భారీగా భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. తీన్‌మార్ డప్పులు, థింసా నృత్యాలతో సతకంపట్టు వరకు ఘటాల ఊరేగింపు హోరెత్తింది. అమ్మవారికి వేకువజామునే కలెక్టర్ విజయసునీత, జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, ఏఎస్పీ ధీరజ్, సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, డాక్టర్ నర్సింగరావు, డీఆర్వో పద్మావతి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలు, ఇత్తడి ఘటాలకు కుంకుమ పూజల అనంతరం ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు.

గర్భగుడి నుంచి ఊరేగింపుగా..

ఉత్సవ విగ్రహం, పాదాలు, ఇతర ఘటాలను వారంతా గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సతకంపట్టు వద్ద కొలువుదీర్చారు. కలెక్టర్ విజయసునీత, పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, మాజీ ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, గిడ్డి ఈశ్వరి, కమిటీ పెద్దలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఊరేగింపులో భారీగా పాల్గొన్న భక్తులు మోదకొండమ్మ తల్లీ.. కరుణించమ్మా అంటూ స్మరించుకున్నారు. ఊరేగింపులో తీన్‌మార్ డప్పులు, గరగలు, థింసా నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించడంతో సతకంపట్టు వద్ద ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు ఇంటి పండగలను నిర్వహించి మోదమ్మకు మట్టి ఘటాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొట్టగుళ్లి రామారావు, ప్రసాద్‌నాయుడు, వెంకటరమణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాతరలో ప్రత్యేక వైద్య శిబిరాలు

పాడేరు : ఉత్సవాల సందర్భంగా పాడేరు పట్టణంలో వైద్యారోగ్య శాఖ అధికారులు ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. పట్టణంలోని పాత బస్టాండ్, సుండ్రుపుట్టు సాయిబాబా ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వైద్యాధికారులు హిమబిందు, రాంబాబు 220 మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా పర్యవేక్షించారు.

ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరి

జాతరకు వచ్చే భక్తులు తగిన ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో సూచించారు. జాతరలో విక్రయించే నిల్వ ఆహార పదార్థాలు, నిల్వ ఉంచిన పానీయాలు తీసుకోవద్దని సూచించారు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రస్తుతం ఎపిడమిక్ సీజన్ దృష్ట్యా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధులు ప్రబలితే నిర్లక్ష్యం చేయకుండా సమీపంలో ఉన్న ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్యం పొందాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా నిర్వహించే ప్రత్యేక వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సిబ్బంది సాంబశివరావు, మురళి, సింహాచలం, చంద్రమ్మ, రత్నకుమారి పాల్గొన్నారు. అమ్మవారి ఘటాన్ని పురవీధుల్లో ఊరేగించారు.

బైక్‌పై లిఫ్ట్ ఇచ్చి చాకుతో దాడి

- దేవరాపల్లిలో యువకుడికి గాయాలు
- నగదు, సెల్‌ఫోన్‌తో గుర్తు తెలియని వ్యక్తుల పరారీ


కె.కోటపాడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీను

దేవరాపల్లి: తెల్లవారుజామున బస్సులు ఇతర వాహనాలు లేకపోవడంతో లిఫ్ట్ అడిగిన పాపానికి ఓ యువకుడిపై గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు చాకుతో దాడి చేశారు. అతడి వద్ద రూ.5 వేలతో పర్సును, సెల్‌ఫోన్‌ను ఎత్తుకుపోయారు. దేవరాపల్లిలో ఆదివారం వేకువ జామున 5 గంటల ప్రాంతంలో ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం... విజయనగరం జిల్లా ఎస్. కోట మండలం వెంకటరమణపేటకు చెందిన జవ్వాది శ్రీను(32) విశాఖ నుంచి దేవరాపల్లిలో తన అత్తవారింటికి శనివారం రాత్రి బయలుదేరాడు. కొత్తవలస వరకు బస్సులోను, అక్కడ నుంచి వావిలపాడు జంక్షన్ వరకు క్వారీ లారీ మీద చేరుకున్నాడు. అక్కడ ఏ వాహనం దొరక్కపోవడంతో దేవరాపల్లికి నడుచుకుంటూ బయలుదేరాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై దేవరాపల్లి వైపు వస్తుండగా, వారిని ఆపి తీసుకెళ్లాలని కోరాడు. అతడిని ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని దేవరాపల్లిలో దించకుండా శారదా నది వంతెన వైపు నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ అతడి జేబులో పర్సు, సెల్‌ఫోను ఇవ్వకపోతే చంపేస్తామంటూ చాకుతో బెదిరించారు. దీంతో భయబడిన శ్రీను రూ.5 వేలతో పర్సు ఇచ్చేసి, సెల్‌ఫోన్ ఇవ్వడానికి నిరాకరించాడు. దీంతో రెచ్చిపోయిన యువకులు అతనిపై చాకుతో దాడికి దిగారు. ఈ దాడిలో శ్రీను చేతి వేళ్లు, తలతోపాటు శరీరంలో పలు చోట్ల విచక్షణారహితంగా తీవ్రంగా గాయపర్చారు. దాంతో సెల్‌ఫోను వారికిచ్చేసి ప్రాణభయంతో పరుగులు తీశాడు. అయినా అతడిని వెంబడించడంతో వంతెన దగ్గరలో ఇటుక బట్టీలు వద్దకు చేరుకుని, పెద్దగా కేకలు వేయడంతో అక్కడ వారంతా నిద్రలేచి చూసేసరికి దాడికి పాల్పడిన యువకులు పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన శ్రీనును దేవరాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కె. కోటపాడు ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఎస్ఐ డి. నాగేంద్ర కేసు నమోదు చేశారు. ఈ దాడికి పాల్పడిన వారి గురించి ఆరా తీస్తున్నామన్నారు.

పచ్చదనానికి సపోర్టు

- విశాఖ పోర్టు అథారిటీ కీలక నిర్ణయం
- నగర వ్యాప్తంగా 10 లక్షల మొక్కలు పెంచేందుకు సన్నద్ధం
- ఇప్పటికే 5 లక్షలకు పైగా మొక్కలు నాటిన విశాఖ పోర్టు
- 2025 ఏప్రిల్ నాటికి లక్ష్యాన్ని చేరుకునేలా ప్రణాళికలు
- కాలుష్య నియంత్రణకు ప్రకృతి సిద్ధ నివారణే మార్గమని నిర్ణయం


మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పోర్టు చైర్మన్ డా.అంగముత్తు


విశాఖపట్నం పోర్టు

సాక్షి, విశాఖపట్నం : కాలుష్యం పెరుగుతోందంటూ వస్తున్న విమర్శలను ప్రకృతి సిద్ధంగా తిప్పికొడుతూ పర్యావరణహిత ప్రణాళికలతో విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ) ముందడుగు వేస్తోంది. ఇప్పటికే పోర్టు పరిసరాల్లో లక్షలాది మొక్కలు నాటి కాలుష్య నివారణ చర్యలకు ఉపక్రమించిన పోర్టు ఈసారి భారీ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా మహా విశాఖ నగరంలో 10 లక్షలు మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తమ భుజస్కందాలపైకెత్తుకుంది. ప్రగతి విశాఖకు పచ్చల హారాన్ని తొడిగేందుకు పోర్టు సన్నద్ధమవుతోంది.

ధూళి ఎగరకుండా చర్యలు

మహావిశాఖ నగరాన్ని ఆనుకొని ఉన్న విశాఖపట్నం పోర్టు కారణంగా కాలుష్యం పెరుగుతోంది. దుమ్ము కణాలు, నల్లటి మసిపొడి ఎంవీపీ కాలనీ వరకూ విస్తరిస్తోంది. దీన్ని నివారించేందుకు కవర్ షెడ్లు ఏర్పాటు చేయడంతో పాటు బొగ్గు నిల్వలపై ఎప్పటికప్పుడు నీటి పిచికారీ చేసి ధూళి ఎగరకుండా చర్యలు తీసుకుంటోంది. మూడేళ్లుగా పోర్టు పరిధిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని విస్తారంగా నిర్వహిస్తోంది. పోర్టు చుట్టు పక్కల పచ్చదనాన్ని పెంపొందించేందుకు 650 ఎకరాల్లో 5,65,500 మొక్కలను నాటారు. అయినప్పటికీ కాలుష్యం పెరుగుతోందంటూ విమర్శలు వెల్లువెత్తుతుండటంతో మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించింది.

ఏడాదిలో 10 లక్షల మొక్కలు

పర్యావరణ దినోత్సవం సందర్భంగా పోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో విశాఖ నగర పరిధిలో ఏకంగా 10 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించింది. ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ల్యాండ్ రెస్టోరేషన్ స్టాపింగ్ డీ సర్టిఫికేషన్ అండ్ బిల్డింగ్ డ్రాట్ రెసిలియన్స్ థీమ్‌తో నిర్వహిస్తున్న నేపథ్యంలో పోర్టు చైర్మన్ డా.అంగముత్తు ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. ఇందుకనుగుణంగా కేవలం 3 నెలల వ్యవధిలోనే 10 లక్షల మొక్కలు నాటేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. రూ.15 కోట్లతో పోర్టుకు చెందిన 186 ఎకరాల్లో మొక్కలు పెంచనున్నారు. 2025 మార్చి నాటికి ప్రతి మొక్క బతికేలా పోర్టు సంరక్షణ బాధ్యతలు తీసుకోనుంది. ఈ మొక్కల పెంపకం వల్ల కాలుష్యం నివారించడంతో పాటు విశాఖలో ఉష్ణతాపాన్ని కూడా కొంత మేర తగ్గించే అవకాశం ఉందని పోర్టు భావిస్తోంది. గ్లోబల్ వార్మింగ్ కారణంగా దేశ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటుతుండటంతో మొక్కల పెంపకం వల్ల విశాఖ నగరంలో చల్లదనం పరచుకుంటుందని దీని ద్వారా ఉష్ణోగ్రతలు నియంత్రించే అవకాశం ఉంటుందని పోర్టు అధికారులు చెబుతున్నారు. 10 లక్షల మొక్కలు నాటడంలో భాగంగానే.. సబ్బవరంలోని ఇండియన్ మారీటైం యూనివర్సిటీలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు రాష్ట్ర అటవీ శాఖతో కలిసి సుమారు 4 ఎకరాల్లో 2 వేల మొక్కలను పెంచనుంది.

బాలికను రక్షించిన లైఫ్‌గార్డ్స్


బాలికను రక్షించిన లైఫ్‌గార్డ్స్

దాబాగార్డెన్స్: ఆర్.కె.బీచ్ వద్ద సముద్రంలో మునిగిపోతున్న బాలికను జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్ రక్షించారు. రామ్‌నగర్‌కు చెందిన సుధా అనే బాలిక ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి ఆర్.కె.బీచ్‌కు వచ్చింది. ఈ క్రమంలో స్నానానికి దిగిన ఆ బాలిక అలల తాకిడికి లోపలికి వెళ్లిపోతున్నట్టు లైఫ్‌గార్డ్‌లు ఆనంద్, వాసు, అచ్చెన్న గమనించారు. వెంటనే రంగంలోకి దిగి ఆమెను రక్షించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సముద్ర స్నానాలకు దిగే సందర్శకులు అప్రమత్తంగా ఉండాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ విజ్ఞప్తి చేశారు.

ఆకట్టుకున్న నృత్య రూపకం

పీఎంపాలెం (విశాఖ) : వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు శిల్పారామం (జాతర)లోని కళా వేదికపై ప్రదర్శించిన శ్రీసాయిచరిత్ర కూచిపూడి నృత్య రూపకం ప్రేక్షకులను అలరించింది. నగరంలోని జోష్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కళాకారుల కూచిపూడి నృత్య ప్రదర్శన ఆద్యంతం ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంది. శ్రీ షిర్డీ సాయిబాబా జీవిత చరిత్రలోని ప్రధాన ఘట్టాలను కళ్లకు కట్టినట్టు నృత్య రూపకంలో ప్రదర్శించారు. కళాకారులు కేశవ్, అన్నపూర్ణ, మోహన్, సంజన, రమ్య, యశశ్రీ, భాసిత, ఆశాలత, చిన్ని, ప్రసన్న, శిరీష, హాష్య, సౌజన్య తదితరులు నృత్యం చేయగా మురళీ గోవింద నృత్య దర్శకత్వం వహించారు. స్థానిక ఏవో విశ్వనాథరెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేసి 108 స్వర్ణసంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణమండంలోని వేదికపై అధిష్టంపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం జరిపారు. సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు

కంచరపాలెం(విశాఖ): కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలకంరించారు. ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ పరిసరాల్లో వంటా వార్పు చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ చైర్మన్ లండా రమణ, సిబ్బంది, పాలకవర్గ సభ్యులు భక్తుల సౌకర్యాలు పర్యవేక్షించారు.

ఉత్తరాంధ్రలో కాపులంతా తూర్పు కాపులే..

ఉత్తరాంధ్ర తూర్పు కాపు సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు సత్యారావు మాస్టారు


మాడుగులలో సంఘ సమావేశంలో మాట్లాడుతున్న సత్యారావు మాస్టారు

మాడుగుల: ఉత్తరాంధ్రలో ఉన్న కాపులంతా తూర్పుకాపులేనని ఉత్తరాంధ్ర తూర్పు కాపు సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు సత్యారావు మాస్టారు అన్నారు. ఆదివారం మాడుగులలో నియోజకవర్గ స్థాయి తూర్పుకాపు సంక్షేమ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1970లో కాపులను తూర్పు కాపులుగా పరిగణిస్తూ జీవోను జారీ చేశారన్నారు. ఈ జీవో అనుసరించి బీసీ–డీ సర్టిఫికెట్లు అందజేస్తున్నారన్నారు. తూర్పుకాపులను అవమానిస్తే సహించేది లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో తూర్పుకాపులకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి, చైర్మన్, డైరెక్టర్లను నియమించిందన్నారు. దీనిలో భాగంగా ఎం.కోడూరుకు చెందిన గొల్లవిల్లి ప్రభావతి డైరెక్టరుగా పని చేసి కులాభివృద్ధికి కృషి చేశారన్నారు. తూర్పుకాపుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ ఐక్యతతో పని చేయాలన్నారు. మాడుగుల ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, ఎం. కోడూరు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ శానాపతి కొండలరావు, తూర్పుకాపు సంక్షేమ సంఘం సభ్యులు దంగేటి సూర్యారావు, తలారి అప్పారావు, జెర్రిపోతుల సూర్యనారాయణ, పెంటకోట జగన్నాథరావు, బొద్దాపు భాస్కరరావు, పర్రే రామునాయుడు, ఉండూరు దేముడు, సాలాపు వీరునాయుడు, పడాల అప్పలనాయుడు పాల్గొన్నారు.

టీకాలే శ్రీరామరక్ష

- చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి
- ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ



మహారాణిపేట: గర్భిణులతో పాటు అప్పుడే పుట్టిన చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయాలని వైద్యులు సూచిస్తున్నారు. అయితే చాలా మందికి, టీకాలపై సరైన అవగాహన లేకపోవడంతో అనేక రకాల వ్యాధులకు గురవుతున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందజేసే ఈ వ్యాధి నిరోధక టీకాలపై పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలని వైద్యులు చెబుతున్నారు. ప్రతీ బుధవారం, శనివారం గర్భిణులకు, చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు వేస్తారు.

- గర్భిణిగా నిర్ధారణ అయిన వెంటనే 3 నెలలు నిండిన తర్వాత టి.టి. ఇంజక్షన్ వేయాలి. నెల వ్యవధిలో మరో టి.టి. వేయాలి. వీటితో పాటు ఐరన్–ఫోలిక్, కాల్షియం టాబ్లెట్లు ఇస్తారు. ప్రసవం అనంతరం ఐరన్ మాత్రలు ఇస్తారు.
- అప్పుడే పుట్టిన చిన్నారికి 24 గంటల వ్యవధిలో పోలియో చుక్కలు, హెపటైటిస్ బి డోస్ వేయాలి. వీటి వల్ల పోలియో, పచ్చ కామెర్ల వ్యాధి నుంచి చిన్నారిని కాపాడవచ్చు.
- 14 రోజుల వ్యవధిలో బి.సి.జి(క్షయ వ్యాధి రాకుండా) టీకా వేయాలి. ఇది 6 వారాలు, 14 వారాల్లో ఐ.పి.వి. చుక్కలు వేయాలి. వీటితో పాటు 6 వారాలు, 10, 14 వారాల వ్యవధిలో పోలియో చుక్కలు, పెంటావాలెంట్ వేయాలి. వీటి వల్ల కోరింత దగ్గు, కంఠసర్పి, ధనుర్వాతం, మెదడు వాపు వ్యాధి, పచ్చకామెర్లు రాకుండా చిన్నారిని కాపాడుకోవచ్చు.
- 9 నెలల నుంచి 12వ నెల వ్యవధిలో తట్టు వ్యాధి రాకుండా మీజిల్స్, కంటి, చర్మ వ్యాధులు రాకుండా విటమిన్ 'ఎ' చుక్కలు వేయాలి.
- 16 నెలల నుంచి 24 నెలల వ్యవధిలో బూస్టర్ డోస్ డీపీటీ, మీజిల్స్, విటమిన్ 'ఎ' ఓపీవీ వేయాలి.
- 5 సంవత్సరాలు పూర్తయితే డి.పి.టి ఒక డోస్ వేయాలి.
- 10 సంవత్సరాలు, 16 సంవత్సరాలు పూర్తయితే టెట్నాస్ (టీ.టీ) వేయాలి. 9 నెలల నుంచి 5 సంవత్సరాల వయసు లోపల ప్రతి 6 నెలలకు ఓసారి విటమిన్ 'ఎ' 9 డోస్లు వేయాలి.

అవగాహన అవసరం



గర్భిణులకు, చిన్నారులకు నిర్దేశిత వేళల్లో వ్యాధి నిరోధక టీకాలు వేయాలి. వీటి వల్ల ప్రాణాంతకమైన వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడుకోవచ్చు.

– సీహెచ్ పూర్ణేంద్ర బాబు, వ్యాక్సినేషన్ నోడల్ అధికారి, టీబీ నివారణ అధికారి

జలపాతం వద్ద సందర్శకుల సందడి

నాతవరం: మండలంలోని సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకుల సందడి నెలకొంది. ఇక్కడ ఎత్తయిన రెండు కొండల మధ్యలోంచి జాలువారే నీటిలో జలకాలాడేందుకు పోటీ పడ్డారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు దఫాదఫాలుగా జలకాలాడుతూ ఉత్సాహంగా గడిపారు. దట్టమైన అటవీ ప్రాంతమంతా కలియ తిరిగారు. కొందరు జలపాతం వద్ద వంటలు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. సందర్శకులు తగట్టుగా జలపాతం వద్ద మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. ఇటీవల జలపాతానికి వీరి తాకిడి గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో తారురోడ్డు నుంచి జలపాతానికి వెళ్లే మెటల్ రోడ్డు పూర్తిగా శిథిలం కావడంతో రాకపోకలకు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే రోడ్డు మరింత అధ్వానంగా మారుతోంది.

ఉరుములు, మెరుపులతో భారీ వర్షం

హుకుంపేట: మండలంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఉరుములు మెరుపులతో పాటు అక్కడక్కడ పిడుగులు పడటంతో గిరిజనులు భయాందోళనలు చెందారు. స్థానిక వెలుగు కార్యాలయం సమీపంలోని చెట్టు పిడుగుపాటుకు చీలిపోయింది.

సీలేరు: ఆంధ్రా– ఒడిశా సరిహద్దు సీలేరులో ఆదివారం మధ్యాహ్నం నుంచి మూడు గంటల పాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండతీవ్రతకు అల్లాడిన జనం వర్షం కురవడంతో వాతావరణం చల్లబడి ఉపశమనం పొందారు. ఆదివారం వారపు సంత కావడంతో వ్యాపారులు, గిరిజనులు ఇబ్బందులు పడ్డారు.

తడబడితే ముప్పే..!


ఎన్ఏడీ ప్రాంతంలోని ప్రైవేటు స్కూల్లో రికార్డులను పరిశీలిస్తున్న మండల స్థాయి అధికారుల బృందం

మురళీనగర్‌లోని ఓ ప్రైవేటు స్కూల్‌కు మూడేళ్ల నుంచి ప్రభుత్వ గుర్తింపు లేదు. ఇక్కడ విద్యార్థులను నగరంలోని వేర్వేరు బ్రాంచిల్లో నమోదు చేసి మురళీనగర్‌లో దర్జాగానే స్కూల్ నిర్వహిస్తున్నారు. మండల స్థాయి తనిఖీ బృందాల పరిశీలనతో ఇది వెలుగులోకి వచ్చింది. రెన్యూవల్ గుర్తింపు లేదనే కారణంతో ఈ స్కూల్‌కు డీఈవో కార్యాలయం నుంచి షోకాజ్ నోటీసు కూడా జారీ చేసినట్లు తెలుస్తోంది. అయినా పాఠశాలలో ఈ ఏడాదికి కూడా అడ్మిషన్లు కొనసాగిస్తుండటం గమనార్హం.

ఎన్ఏడీ సమీపంలోని ఓ ప్రైవేటు స్కూల్‌కు ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వ పరిధి ఓపెనింగ్ పర్మిషన్ పొంది సీబీఎస్ఈ బోధన పేరుతో అడ్మిషన్లు నిర్వహిస్తున్నారు. 'మా వద్ద సీబీఎస్ఈ సిలబస్' అంటూ స్కూల్ ముందు దర్జాగానే బోర్డులు పెట్టారు. మండల స్థాయి బృందాల తనిఖీల్లో ఇది తేటతెల్లమైంది. అయినా పాఠశాల యాజమాన్యంపై చర్యలు శూన్యం..

- జిల్లాలో కొలిక్కిరాని ప్రైవేటు స్కూళ్ల గుర్తింపు
- ఎంఈవో నేతృత్వంలో ప్రత్యేక బృందాల తనిఖీలు
- 12 నుంచి తెరుచుకోనున్న పాఠశాలలు
- గుర్తింపు లేని స్కూళ్లలో చేరితే ఎన్నో అనర్థాలు

జిల్లాలో మొత్తం **1,387** పాఠశాలలు

ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో **781** స్కూళ్లు

జిల్లాలో మొత్తం విద్యార్థులు **3,94,334** మంది

ఇందులో ప్రైవేటు స్కూళ్లకు వెళ్లే వారు **2,98,330** మంది

విశాఖ విద్య: 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ నెల 12న జిల్లాలోని పాఠశాలలన్నీ తెరుచుకోనున్నాయి. అయితే జిల్లాలో ప్రైవేటు స్కూళ్ల లెక్క ఇంకా కొలిక్కి రాలేదు. జిల్లాలో మొత్తం 1,387 పాఠశాలలు ఉండగా, 2023–24 విద్యా సంవత్సరంలో వీటిలో 3,94,334 మంది విద్యనభ్యసించారు. వీటిలో ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో 781 స్కూళ్లలో 2,98,330 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ లెక్కన విశాఖ నగరంలో ఎక్కువగా ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్ల ఆధిపత్యమే కొనసాగుతున్నట్లు తేటతెల్లమౌతుంది.

తనిఖీలపై నిర్లక్ష్యమేల

జిల్లాలోని ప్రైవేటు స్కూళ్లకు అనుమతులు ఇచ్చే విషయంలో కఠినంగా వ్యవహరించాలని డీఈవో ఎల్.చంద్రకళ తమ యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఇందుకోసమని మండల స్థాయిలో ఎంఈవో నేతృత్వంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. బడులు తెరిచే నాటికి ప్రైవేటు స్కూళ్ల లెక్క తేల్చాలనే డీఈవో ఆదేశించినా, మండల స్థాయి అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ గుర్తింపు లేకున్నా, జిల్లాలోని కొన్ని స్కూళ్లలో దర్జాగానే విద్యార్థులకు అడ్మిషన్లు ఇస్తూ యాజమాన్యాలు విద్యావ్యాపారం చేస్తున్నాయి. గుర్తింపు లేని స్కూళ్లలో చేరిన విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్నందున, దీనిపై తల్లిదండ్రులు ఒకటికి రెండు సార్లు ఆలోచన చేసి అన్ని అనుమతులు ఉన్న పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలి.

నిబంధనలు ఇవిగో..

- ప్రైవేటు పాఠశాలలకు నిర్వహణకు ప్రభుత్వ గుర్తింపు తప్పనిసరిగా ఉండాలి.
- ఏ రకమైన పుస్తకాలను పాఠశాల ప్రాంగణంలో విక్రయించడానికి వీల్లేదు. 2009లో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులు 91 ప్రకారం ఐఐటీ, ఒలింపియాడ్, కాన్సెప్ట్, ఈ–టెక్నో, ఈ–శాస్త్ర వంటి పేర్లతో పాఠశాల బోర్డుల్లో కానీ, పాఠశాల ప్రాంగణంలో కానీ రాయకూడదు. వీటి పేరుతో ప్రచారం కూడా చేయకూడదు.
- ప్రభుత్వ ఉత్తర్వులు 1/1994లోని రూల్ 18 ప్రకారం నిర్ణయించిన ప్రకారమే విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయాలి. తరగతుల వారీగా ఎంత ఫీజు వసూలు చేస్తున్నారనేది బహిరంగపరస్తూ, అందరికీ కనిపించేలా నోటీసు బోర్డులో ఆ వివరాలు ఉంచాలి.
- పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు నేరుగా కాకుండా బ్యాంకుల ద్వారా వేతనాలు అకౌంట్లలోనే జమ చేయాలి.
- ఆట స్థలం, అర్హత గల ఉపాధ్యాయులు, ఫైర్ సేఫ్టీ అనుమతులు ఉండాలి.

శారదా నదిలో జలకళ


శారదా నదిలో ప్రవహిస్తున్న నీరు

రాంబిల్లి: శారదా నదిలో జలకళ సంతరించుకుంది. సాధారణంగా వేసవిలో ఈ నదిలో నీరు ప్రవహించేది కాదు. గతేడాది కూడా వేసవిలో నీరు ప్రవహించింది. ఈ ఏడాది అదే తరహాలో ప్రవహిస్తోంది. దీంతో రబీ వరి సాగుకు నీటి సమస్య తలెత్తలేదు. దాంతో మంచి దిగుబడులు సైతం వచ్చాయి. మరో పక్క మండు వేసవిలోనూ శారదా నదిలో నీరు ప్రవహించడంతో పశువులకు నీటి సమస్య లేదని పాడి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బొర్రాకు భారీగా పర్యాటకులు


సందర్శనకు వచ్చిన పర్యాటకులు

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు పర్యాటకులు పోటెత్తారు.. శనివారం మూడు వేల మంది గుహలను సందర్శించగా రూ. 3 లక్షల ఆదాయం వచ్చింది. ఆదివారం నాలుగు వేల మంది సందర్శించగా రూ.3.91 లక్షల ఆదాయం వచ్చిందని మేనేజర్ గౌరీ శంకర్ తెలిపారు. బొర్రా జిప్‌లైన్‌కు సందర్శకుల తాకిడి పెరిగింది. ఆదివారం రూ. 1.16 లక్షల ఆదాయం వచ్చిందని అధికారవర్గాలు తెలిపాయి.

దోమ పుట్టకుండా.. పుట్టినా కుట్టకుండా..

- ఊరూవాడా మలేరియా మాసోత్సవాలు
- దోమల నియంత్రణపై విస్తృతంగా ప్రచారం
- ఇంటింటి ఆరోగ్య సర్వేలో వైద్య, ఆరోగ్య సిబ్బంది

వర్షా కాలం సమీపిస్తోంది. రుతుపవనాల ఆగమనం కూడా అనుకున్నట్లుగానే ఉంది. ఇదే సమయంలో ప్రజల్ని, అధికారుల్ని సీజనల్ వ్యాధులు భయపెడుతున్నాయి. మరీ ముఖ్యంగా మలేరియా వ్యాధి ఎక్కువగా వ్యాపించే సీజన్ ఇదే. దీంతో వైద్య, ఆరోగ్య సిబ్బంది మలేరియా నియంత్రణ చర్యల్లో బిజీ అయ్యారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా ఊరూవాడా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



తుమ్మపాల పీహెచ్‌సీలో మలేరియా వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి



తుమ్మపాల గ్రామంలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది



మార్టూరులో డ్రైనేజీలో దోమల మందు పిచికారీ చేస్తున్న మలేరియా ఉద్యోగులు

అనకాపల్లి: ఆరోగ్య సమతుల్యత సాధనే ధ్యేయంగా మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో అధికారులు బిజీగా ఉన్నారు. ఈ నెల 1 నుంచి 30 వరకు మలేరియా నియంత్రణకు ఊరూవాడా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు గ్రామాల్లో ప్రజల్ని కలిసి, పరిసరాల పరిశుభ్రత, రోగాలు వ్యాపిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్ని చైతన్య పరుస్తున్నారు.

గ్రామాల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది

అనకాపల్లి మండలంలోని తుమ్మపాల, తగరంపూడి పీహెచ్‌సీ పరిధిలో 32 పంచాయతీలున్నాయి. మలేరియా నియంత్రణకు వైద్య ఆరోగ్య సిబ్బంది ఆయా ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. వీరికి తోడుగా సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో ఇంటి సరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు చెప్తున్నారు. ప్రస్తుతం మండలంలోని 6 గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు.

దోమల నియంత్రణపై దృష్టి

మలేరియాతోపాటు చాలా సీజనల్ వ్యాధులు దోమల ద్వారానే వ్యాపిస్తున్నాయి. దోమలు ఎక్కువగా నిల్వ నీటిలోనే వృద్ధి చెందుతాయి. దీంతో కాలువలు, నిల్వ నీరున్న చోట దోమల నియంత్రణ మందు పిచికారీ చేస్తున్నారు. కాలువలు, బావులు తదితర నీటి నిల్వలున్న చోట గంబూషియా చేపలను విడిచిపెడుతున్నారు. ఇవి దోమల లార్వాలను తినడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని అధికారులు చెప్తున్నారు. గృహాల్లో గోడలపై అవసరాన్ని బట్టి దోమల మందులను స్ప్రే చేయాలని సూచిస్తున్నారు. దోమ తెరలు, దోమచక్రాల ద్వారా కూడా రక్షణ పొందవచ్చంటున్నారు. దోమల్ని అరికడితే మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, మెదడువాపు, బోధ తదితర వ్యాధుల బారినపడే అవకాశాలు తగ్గుతాయని చెప్తున్నారు.

మలేరియాపై అప్రమత్తం

మలేరియా ఆడ అనాఫిలస్ దోమల ద్వారా వ్యాపిస్తుంది. ప్లాస్మోడియా జాతికి చెందిన రెండు క్రిముల వల్ల మలేరియా వ్యాప్తి చెందుతుంది. దీనిలో వైవాక్స్ మలేరియా తక్కువ బాధిస్తే, పాల్సీఫారం మలేరియా ఎక్కువ బాధించడమే కాకుండా కొన్నిసార్లు ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంది. దోమ కుట్టిన 8 నుంచి 12 రోజుల్లో వ్యాధి లక్షణాలు బయటపడతాయి. చలి జ్వరం, వణుకుతో కూడిన జ్వరం దీని ప్రధాన లక్షణం. చిన్నపిల్లలకు, గర్భిణులకు ఈ వ్యాధి ప్రమాదకరమైనది. జ్వరం వచ్చిన రెండు మూడు రోజుల్లో రక్త పరీక్షల ద్వారా దీన్ని గుర్తించి, సరైన చికిత్స తీసుకుంటే భయపడాల్సిన పనిలేదు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



ఈ సీజన్లో ఎక్కువగా వ్యాపించేది మలేరియా. అందుకే ఈ వ్యాధిపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించేందుకు, పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. రోజుల తరబడి నిల్వ నీరు లేకుండా వారంలో ఓ రోజు డ్రై డే పాటించేలా ప్రజల్ని చైతన్య పరుస్తున్నాం. నిల్వ నీటిలోనే దోమలు గుడ్లు పెట్టి, వృద్ధి చెందుతాయి. దోమకాటుకు పగలు, రాత్రి అనే తేడా లేదు. ఏ సమయంలో కుట్టినా వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. చిన్నాపాటి జ్వరం వచ్చినా సమీపంలోని వైద్యుల్ని సంప్రదించి, మందులు వాడితే ఆరోగ్యంగా జీవించవచ్చు.

– బి.సంఘం, వైద్య సిబ్బంది, తుమ్మపాల పీహెచ్‌సీ

ప్రజల సహకారంతోనే పరిశుభ్రత



మలేరియా వ్యాధి అనాఫిలిస్ అనే ఆడదోమ కాటు వల్ల సోకుతుంది. ఈ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే దగ్గర్లోని వైద్యుల్ని సంప్రదించాలి. రక్తమార్పిడి సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. మలేరియా వ్యాధి సోకిన వ్యక్తి సకాలంలో మందులు వాడితే ప్రాణహాని తప్పించుకోవచ్చు. నిర్లక్ష్యం చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనే పరిస్థితి వస్తుంది. మలేరియా మాసోత్సవాలను పురస్కరించుకుని గ్రామాల్లో మలేరియా వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రజలు సహకరిస్తే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచవచ్చు.

– ఎస్‌ఏ నజరత్ సమీమ్, వైద్యాధికారి, తుమ్మపాల పీహెచ్‌సీ

క్లుప్తంగా

దంత వైద్య శిబిరానికి స్పందన



గ్రామస్తులకు దంత వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రకాష్

తుమ్మపాల: దంత సమస్యలు ఉత్పన్నమైన వెంటనే వైద్యులను సంప్రదించి, దంతాలు దృఢంగా ఉండేలా కాపాడుకోవాలని ప్రముఖ దంత వైద్యుడు డాక్టర్ ప్రకాష్ అన్నారు. మండలంలోని రేబాక గ్రామం శ్రీవినాయక మందిరంలో సుజాత డెంటల్ క్లినిక్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. గ్రామస్తులకు దంత పరీక్షలు చేసారు. దంత సంరక్షణకు పలు సూచనలు చేశారు. పల్ల మధ్య దూరం, రూట్ కెనాల్ తదితర చికిత్సలపై అవగాహన కల్పించారు. పరీక్షల అనంతరం అవసరమైన మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో ఆస్పత్రి సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆహారపు అలవాట్ల మార్పుతోనే ఆరోగ్యం



వైద్యశిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ సంపత్

అనకాపల్లి: మారుతున్న కాలానికనుగుణంగా వయస్సును బట్టి ఆహారపు అలవాట్లల్లో మార్పులు చేసుకోవాలని, రోజూ పాలు, గుడ్లు తీసుకుంటే శరీరంలో ఎముకలు దృఢంగా ఉంటాయని గీతా ఆస్పత్రి ఎముకల వైద్యుడు డాక్టర్ వి.సంపత్ అన్నారు. స్థానిక మెయిన్‌రోడ్డు వద్ద వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారులపై ఫాస్ట్‌ఫుడ్ తినేవారు వ్యాధుల బారినపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా నిత్యం వ్యాయామం చేయడంతో ఎముకలు గట్టిపడి శరీరంలో రక్తప్రసరణ బాగా జరుగుతుందన్నారు. వారానికి రెండు సార్లు ఆకుకూరలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు 50 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు భీశెట్టి రామకృష్ణ, కార్యదర్శి యల్లపు సాంబశివరావు, కోశాధికారి రాపేటి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గణపతి ఆలయ వార్షికోత్సవం

నక్కపల్లి: ఉద్దండపురంలో గణపతి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి గణపతి హోమాలు, విశేష పూజలు నిర్వహించారు. ఉద్దండపురం, గుల్లిపాడు, తదితర గ్రామాల నుంచి భక్తులు స్వామిని దర్శించుకున్నారు. అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వీసం రామకృష్ణ, పాడగట్ల పాపారావు, సర్పంచ్ పాడగట్ల వెంకటేష్, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి	:రాజా
మనమే	:సత్యనారాయణ స్క్రీన్-1
గం గం గణేశా	:సత్యనారాయణ స్క్రీన్-2
బ్యాడ్ బాయ్స్(రైడ్ ఆర్ డై)	:షిర్డిసాయి
లవ్ మౌళి	:పర్తిసాయి
సత్యభామ	:వెంకటేశ్వర
వెపన్	:శ్రీసత్య
భజే వాయు వేగం	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 81 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-12 యూనిట్లు, బీ పాజిటివ్-39 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-25 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు, ఏబీ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 392 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 253 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(0892 4223595)ని సంప్రదించవచ్చు.

చిత్రలేఖనం విజేతలకు బహుమతుల ప్రదానం



చిత్ర లేఖనం పోటీలో బహుమతులు పొందిన విద్యార్థులు

కశింకోట: విద్యార్థులు చదువుతోపాటు ఆటలు, ఇతర కళల పట్ల శ్రద్ధ చూపాలని ఐద్వా జిల్లా కార్యదర్శి డి.డి.వరలక్ష్మి సూచించారు. కశింకోటలోని పూసర్లవీధిలో ఆదివారం ఐద్వా ఆధ్వర్యంలో బాలలకు చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటలు మానసికోల్లాసానికి, శారీరక దారుఢ్యానికి దోహదపడతాయన్నారు. పిల్లల్ని ఆటల పట్ల తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. చిత్రలేఖనం పోటీలో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, విద్యార్థులు రక్షిత రేవంత్, అనన్య, లోహిత్, దక్షిత్, స్నేహ శ్రీ రోషిత, లౌక్య, శ్రీరిషిత తదితరులు పాల్గొన్నారు.

మోదీ ప్రమాణస్వీకారంతో సంబరాలు



కశింకోటలో ఎన్‌డీఏ కూటమి శ్రేణుల సంబరాలు

కశింకోట: ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేయడం పట్ల ఎన్‌డీయే కూటమి పార్టీల శ్రేణులు కశింకోటలో ఆదివారం సంబరాలు చేసుకున్నాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. బాణసంచా కాల్చారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పార్టీ నాయకులు ఎంఎం నాయుడు, కె.రాజారావు, తిరుచోళ్ల రామకృష్ణ, వై.రాజు, టీడీపీ నాయకులు వేగి గోపీకృష్ణ, చిదిరెడ్డి శ్రీనివాసరావు, జనసేన నాయకుడు దాసరి బాబు తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనతో దేశం అభివృద్ధి



నూకాంబిక అమ్మవారికి సారె సమర్పిస్తున్న బీజేపీ జిల్లా కార్యదర్శి నాగమణి

అనకాపల్లి: ప్రధానిగా మూడోసారి నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం చేయడం దేశాభివృద్ధికి మరింతగా దోహదపడుతుందని బీజేపీ జిల్లా కార్యదర్శి నాగమణి అన్నారు. మోదీ ప్రమాణస్వీకారం సందర్భంగా పార్టీ ఆధ్వర్యంలో స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారికి కొబ్బరి కాయలు, గాజులు, పసుపు, కుంకుమలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరోనా సమయంలో కేంద్రంలో ఉన్న బీజేపీ సేవల్ని మర్చిపోలేమన్నారు. దేశంలో రాష్ట్రాల రాజధానుల్ని కలుపుతూ జాతీయ రహదారులను ఏర్పాటు చేసిన ఘనత బీజేపీకే దక్కిందన్నారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణలు పార్లమెంట్, నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మహిళా నాయకులు సంతోషికుమారి, కనకమహాలక్ష్మి, రాజాన దేవి, మంగ, సత్యవాణి, అశ్వినిలు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలి



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక: విద్యార్థులు ఇష్టపడి, కష్టపడి చదువుకుంటే మంచి ఫలితాలు సొంతం చేసుకోవచ్చని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అన్నారు. మునగపాకలోని సంతబయల గౌతమ పఠన మందిరం ఆధ్వర్యంలో వేసవిలో విద్యార్థులకు డ్రాయింగ్‌పై శిక్షణ నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆమె విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థులు స్థానికంగా అందుబాటులో ఉండే గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చదువుతో పాటు ఇతర రంగాల్లో రాణించాలన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి గౌతమ పఠన మందిర సభ్యులు అందిస్తున్న సేవలను కొనియాడారు. మందిర అధ్యక్ష, కార్యదర్శులు మారిశెట్టి అప్పారావు, వెలగా శ్రీనివాసరావు, సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీటీసీ సూరిశెట్టి రాము, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేవీ నిర్వాసితులకు న్యాయం చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న నేవీ నిర్వాసితులు

రాంబిల్లి : నేవీ నిర్వాసితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని పెదకలవలాపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యుడు రావి దేముళ్లు డిమాండ్ చేశారు. ఆదివారం పెదకలవలాపల్లి గ్రామంలో నేవీ నిర్వాసితులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా రోజులుగా నేవీ ప్రహరీ నిర్మాణంతో తమకు అన్యాయం జరుగుతుందన్నారు. అయినా ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. ఇప్పటికైనా నేవీ ప్రహరీ నిర్మాణంతో నష్టపోతున్న వారికి తగిన పరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సుమారు 300 మంది మహిళలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకులు ధైర్యంగా ఉండాలి



రమణమూర్తిని పరామర్శిస్తున్న కంబాల జోగులు

ఎస్.రాయవరం : వైఎస్సార్‌సీపీ నాయకులు ధైర్యంగా ఉండాలని పాయకరావుపేట వైఎస్సార్‌సీపీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. వెంకటాపురంలో ఇటీవల మెడ నొప్పికి శస్త్ర చికిత్స చేయించుకున్న మరిశా రమణమూర్తిని ఆదివారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, జిల్లా కమిటీ అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు, సర్పంచ్‌లు కొప్పిశెట్టి సత్యం, దూళి శ్రీనుబాబు, శానాపతి శ్రీరాములు, నాయకులు పాల్గొన్నారు.

పీజీ కోర్సులు ప్రవేశ పెట్టాలని వినతి

నర్సీపట్నం: గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం స్థానిక అల్లూరి సీతారామరాజు ప్రభుత్వ కళాశాలలో ప్రాధాన్యత కలిగిన పీజీ కోర్సులు ప్రవేశ పెట్టాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజుకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ఐదు వేల మంది చదువుతున్నారని తెలిపారు. పీజీ చదివేందుకు వీరంతా దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని వాపోయారు. ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్సీ, ఎంఏ తదితర పీజీ కోర్సులు అందుబాటులోకి తీసుకువస్తే ఈ ప్రాంత విద్యార్థులకు ఎంతగానో మేలు చేకూరుతుందని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రెసిడెంట్ జి.గీతాకృష్ణ ప్రిన్సిపాల్‌కు వివరించారు. దీనిపై ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

కశింకోట: కార్యకర్తలకు పార్టీ నాయకత్వం అండగా ఉంటుందని, ఎవరూ అధైర్య పడవద్దని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు భరోసా ఇచ్చారు. కశింకోటలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ శ్రేణులు ఎవరి జోలికీ వెళ్లవద్దని, ఎవరైనా అనవసరంగా తమ శ్రేణుల జోలికి వస్తే సహించబోమన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో పార్టీకి కలిగిన నష్టం, లోటుపాట్ల గురించి వార్డుల వారీగా పార్టీ శ్రేణులతో చర్చించి, సమీక్షించారు.

ఉపాధి కూలి రూ.600 చెల్లించాలి



వెంకటాపురంలో కూలీలతో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ

మునగపాక: ఉపాధి హామీ పథకం కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించడంతో పాటు రోజుకు రూ.600 చొప్పున వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ కోరారు. మండలంలోని వెంకటాపురంలో పనిచేస్తున్న ఉపాధి కూలీల సమస్యలను ఆదివారం అడిగి తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధి కూలీలు తమ సమస్యలను వెల్లడించారు. సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి పథకానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడవాలని చూస్తోందన్నారు. ఎంతో మంది పోరాటాల ఫలితంగా ఈ పథకం అమల్లోకి వచ్చిందన్నారు. పని చేసే ప్రాంతాల్లో కూలీలందరికీ సదుపాయాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఘనంగా సత్తెమ్మతల్లి అమ్మవారి పండగ

మునగపాక: మునగపాక దళితవాడలో ఆదివారం సత్తెమ్మతల్లి అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. కాలనీ వాసులంతా డప్పు వాయిద్యాల నడుమ ఘటాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్న మొక్కులు చెల్లించుకున్నారు.

సండే సందడి



తిక్కవానిపాలెం తీరంలో సందడి చేస్తున్న సందర్శకులు

పరవాడ: తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం సముద్ర తీర ప్రాంతాలు ఆదివారం సందడిగా మారాయి. అనకాపల్లి, గవర్ల అనకాపల్లి, వెంకటాపురం, భర్నికం, పరవాడ, లంకెలపాలెం, సబ్బవరం, అగనంపూడి, స్టీల్‌ప్లాంట్, ఎన్టీపీసీ, వాడచీపురుపల్లి తదితర ప్రాంతాల నుంచి తరలివచ్చిన పర్యాటకులు ఉదయం నుంచి సాయంత్రం వరకు తీరంలో ఉత్సాహంగా గడిపారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో వంటి ఆట పాటలతో సందడి చేశారు. సాయంత్రం జలకాలటలతో ఉత్సాహంగా గడిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఏఎంఏఎల్ హైస్కూల్ 1996-97 పదవ తరగతి పూర్వ విద్యార్థులు

తుమ్మపాల: ఏఎంఏఎల్ హైస్కూల్ 1996-97 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. మండలంలోని కొత్తూరు ఏఎంఏఎల్ హైస్కూల్‌లో జరిగిన సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్‌లో పూర్వ విద్యార్థులంతా హాజరై సందడి చేశారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు కూడా కుటుంబ సమేతంగా వచ్చారు. ఆట పాటలతో రోజంతా సందడి చేశారు. పాఠశాల విద్యాభ్యాసం నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను ముఖ్యఅతిథులుగా ఆహ్వానించి సత్కరించారు. పూర్వ ఉపాధ్యాయులు విజయబాబు, సాంబశివరావు, గౌరీశంకర్, జోగారావు, దివాకర్, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఆలయ నిర్మాణం



గ్రామ పెద్దలతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక : కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులు వేగవంతమయ్యేలా చూడాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాకలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీనివాసుని ఆలయ ప్రాంగణంలో ఆదివారం గ్రామపెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణ పనులపై కమిటీ సభ్యులు, పెద్దలు దృష్టి సారించాలన్నారు. అలాగే విరాళాల సేకరణ చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరినీ ఆలయ నిర్మాణంలో భాగస్వామ్యం చేయాలన్నారు. సమావేశంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీటీసీ సూరిశెట్టి రాము, దాడి ముసిలినాయుడు, మొల్లేటి సత్యనారాయణ, కాండ్రేగుల జగ్గారావు, పెంటకోట ఉమేష్, జల్లేపల్లి వెంకట కృష్ణారావు, ఆడారి లక్ష్మణరావు, ఆడారి కాశీబాబు, ఆడారి దానకర్ణ, వెలగా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శిథిల భవనాలతో పొంచివున్న ముప్పు



శిథిలావస్థలో ప్రమాదకరంగా ఉన్న భవనం

కోటవురట్ల: ఏళ్ల తరబడి శిథిల భవనాలను తొలగించకపోవడంతో ప్రమాదం పొంచి చూస్తోంది. అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిథిల భవనాలు ఆందోళనకరంగా ఉన్నాయి. కొంచెం కొంచెంగా కూలిపోతున్నాయి. విద్యార్థులు ఏమరుపాటుగా భవనాల వద్దకు వెళితే ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. చాలా కాలంగా శిథిల భవనాలు ఉన్నా విద్యాశాఖాధికారులు పట్టించుకోలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రమాదం జరగక ముందే శిథిల భవనాలను తొలగించాలని కోరుతున్నారు.